సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 26 । మే । 2024



లాభదాయకంగా కోకో

అంతర పంటగా కోకో సాగు ఆశాజనకంగా మారింది. కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో విస్తారంగా సాగుచేస్తున్నారు. జిల్లాలో 32 వేల ఎకరాలకు పైగా సాగు ఉంది. 8లో ▸



ఆ టేస్టే వేరు!

మామిడికి పెట్టింది పేరు నూజివీడు ప్రాంతం. ఇక్కడి చిన్నరసాలు, పెద్దరసాలు, బంగినపల్లి రకాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. వీటికి గిరాకీ కూడా బాగుంటుంది. 8లో ▸



విద్యార్థులను తీర్చిదిద్దేలా..

విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దేలా డిగ్రీ కళాశాలల్లో నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నట్టు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

27 నుంచి సురభి నాటకోత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆదిత్య కళావేదికపై ఫోకస్ కళా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి మూడురోజుల పాటు సురభి నాటకోత్సవాలు నిర్వహించనున్నట్టు ఫోకస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొన్నాబత్తుల మల్లేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన సురభి నాటక సంస్థ 40 మంది కళాకారులతో నాటక ప్రదర్శన లిస్తారని అన్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్‌కు చెందిన సాయి సంతోష్ నాట్యమండలి మాయాబజార్ నాటకం, 28న భక్త ప్రహ్లాద, 29న పాతాళభైరవి నాటకాలు ప్రదర్శిస్తారన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీ కార్యదర్శి సయ్యపురాజు సూర్యనారాయణ రాజు ,అల్లూరి బంగార్రాజు, తమిరి సాంబమూర్తి, ఎం.సీతారాంప్రసాద్ పాల్గొన్నారు.

కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సంబంధించి సిబ్బంది కేటాయింపుపై తొలి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శనివారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పూర్తిచేశారు. కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ఎన్ఐసీ అధికారులతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు, పర్యవేక్షణకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు కలిపి 859 మంది అవసరం కాగా రిజర్వ్ సిబ్బందిని కూడా కేటాయిస్తూ మొత్తం 955 మందికి సంబంధించి ర్యాండమైజేషన్ నిర్వహించారు. వారిలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు 292 మంది, కౌంటింగ్ అసిస్టెంట్లు 346 మంది, మైక్రో అబ్జర్వర్లు 317 మంది ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 94.90 శాతం హాజరు

భీమవరం: జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ మొదటి సంవత్సరం పరీక్షలకు 94.90 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. జనరల్ పరీక్షకు 6,490 మందికి 6,186 మంది, ఒకేషనల్ పరీక్షకు 396 మందికి 351 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. అలాగే ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షకు 186 మందికి 149 మంది, ఒకేషనల్ పరీక్షకు 142 మందికి 97 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలో ఎక్కడా మాల్‌ప్రాక్టీసు కేసులు నమోదుకాలేదని చెప్పారు.

టెన్త్ పరీక్షకు 14.73 శాతం మంది

జిల్లాలో శనివారం నిర్వహించిన టెన్త్ సప్లిమెంటరీ హిందీ పరీక్షకు 14.73 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. 1,337 మంది విద్యార్థులకు గాను కేవలం 197 మంది మాత్రమే హాజరయ్యారని డీఈఓ ఆర్.వెంకటరమణ తెలిపారు. 24 కేంద్రాల్లో ఫ్లయింగ్‌స్క్వాడ్, 7 కేంద్రాల్లో జిల్లా విద్యాశాఖాధికారి, 3 కేంద్రాల్లో పరీక్షల సహాయ కమిషనర్ తనిఖీలు చేశారన్నారు.

ఎడెక్స్ ద్వారా 15 కోర్సులు



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: తణుకు ప్రభుత్వ కళాశాలలో బీకాం ఫస్టియర్ విద్యార్థిని ఎస్.జ్ఞానశ్రీ పద్మావతి ప్రభుత్వం చేపట్టిన ఎడెక్స్ ద్వారా 15 అంతర్జాతీయ యూనివర్సిటీల నుంచి 15 కోర్సులను పూర్తిచేసి సర్టిఫికెట్ పొందినట్లు ప్రిన్సిపాల్ పి.అనిల్‌కుమార్ తెలిపారు. శనివారం జంగారెడ్డిగూడెంలో జరిగిన జోన్–2 ప్రభుత్వ కళాశాలల సమీక్షా సమావేశంలో కళాశాల విద్యా కమిషనర్ పి.భాస్కర్ విద్యార్థినికి సర్టిఫికెట్లు అందించారన్నారు. ఎడెక్స్ ఒప్పందంలో భాగంగా అంతర్జాతీయ వర్సిటీల్లో కోర్సులు పూర్తిచేయవచ్చన్నారు. వీటిని డిగ్రీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా డీవైఈఓ పరీక్ష

భీమవరం: జిల్లాలో శనివారం నిర్వహించిన ఏపీపీఎస్సీ డీవైఈఓ స్క్రీనింగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. భీమవరం డీఎన్నార్ ఇంజినీరింగ్ కళాశాలలో 130 మంది, విష్ణు కళాశాలలో 100 మంది, డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో 100 మంది, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో 100 మంది, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో 250 మంది, తాడేపల్లిగూడెం శశి ఇనిస్టిట్యూట్ టెక్నాలజీలో 160 మంది హాజరయ్యారు. మొత్తం 840 మంది అభ్యర్థులకు 532 మంది హాజరయ్యారు.

భవిత.. దివ్యాంగులకు బాసట

- ప్రత్యేక అవసరాలకు భవిత కేంద్రాలు
- జిల్లాలో ఇంటింటా 'భవిత' సర్వే
- దివ్యాంగ పిల్లలను బడుల్లో చేర్పించేలా చర్యలు
- సమగ్ర శిక్ష ద్వారా పథకాల అమలు



ఆకివీడులో భవిత కేంద్రం

జిల్లాలో దివ్యాంగ విద్యార్థులు	ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నవారు
3,267	360
కొత్తగా ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు	**జిల్లాలో భవిత కేంద్రాలు**
229	19

భవిత సర్వే: జూన్ 9 వరకు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను బడిబాట పట్టించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. చదువుకు దూరంగా ఉన్న దివ్యాంగ పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే (ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్) నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు పాఠశాలలో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలను కూడా సేకరిస్తున్నారు. చదువు వల్ల ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి అమలవుతున్న రాయితీలు, సదుపాయాల గురించి పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేతో ఇప్పటికే కొందరు బడుల్లో చేరేందుకు ముందుకు వచ్చారని అధికారులు అంటున్నారు.

విస్తృతంగా ఇంటింటా సర్వే

సాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కోట్లాది రూపాయలతో పలు కార్యక్రమాలు చేపడుతున్నాయి. వీటిపై అవగాహన లేక ఇప్పటికే పలువురు తల్లిదండ్రులు ప్రయోజనాలు పొందలేకపోతున్నారు. వైకల్యంతో పుట్టిన తమ పిల్లల ఖర్మ ఇంతేనంటూ మిన్నకుండిపోతున్నారు. దీంతో పిల్లల్లో వైకల్యానికి తోడు విద్యాబుద్ధులు లోపించి ఇళ్లలోనే మగ్గిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఇంటింటా సర్వేను సహిత విద్య అధికారులు విస్తృత స్థాయిలో చేపట్టారు. ఈనెల 1వ తేదీ నుంచి జిల్లాలో సర్వే ప్రారంభం కాగా వచ్చేనెల 9 వరకు భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులతో ఇంటింటా సర్వే నిర్వహించనున్నారు. వేసవి సెలవుల సమయాన్ని భవిత ఉపాధ్యాయులు సర్వే నిమిత్తం వినియోగిస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి గుర్తించిన పిల్లలందరినీ బడుల్లో చేర్పించేలా కార్యాచరణను సిద్ధం చేశారు.



ఇంటింటా సర్వేలో అధికారులు, సిబ్బంది (ఫైల్)



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు (ఫైల్)



ఇంటి వద్ద ప్రత్యేక విద్య (ఫైల్)

ప్రయోజనాలెన్నో..

- భవిత కేంద్రాల్లో చదివే దివ్యాంగులకు ఉచితంగా ఉపకరణాలు అందిస్తారు.
- ప్రతినెలా రూ.300 చొప్పున రవాణా భత్యం చెల్లిస్తారు.
- వినికిడి, దృష్టి లోపం ఉన్నవారికి ఉచితంగా ట్యాబ్‌లు అందిస్తారు.
- 9, 10వ తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం కింద ఏడాదికి రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు అందుతుంది.
- చదువులో రాణించే వారికి ఉన్నత విద్య, ఉపాధికి అవకాశాలు ఉన్నాయి.
- వైకల్య శాతం అధికంగా ఉన్నవారికి సదరం ధ్రువీకరణ పత్రంతో పింఛన్ వస్తుంది.
- బస్సులు, రైళ్లలో ప్రయాణానికి పాస్ సదుపాయం కల్పిస్తారు.
- పాఠశాలకు రాలేని వారి ఇళ్లకే ఉపాధ్యాయులు వెళ్లి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.
- భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యతో పాటు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ అందిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రత్యేక అవసరాల పిల్లలు చదువుకు దూరం కాకూడదు. భవిత కేంద్రాల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో 360 మందికి భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. 136 మందికి ట్యాబ్స్ అందించారు. ఇటీవల శిబిరాలు నిర్వహించి 419 మందికి ఉపకరణాలు అవసరమని వైద్యులు నిర్ధారించారు. సుమారు రూ.54 లక్షలను అలవెన్సుల రూపంలో పిల్లల తల్లిదండ్రుల ఖాతాల్లో జమచేశారు. అతి తీవ్ర వైకల్యం ఉండి పాఠశాలలకు రాలేని 190 మంది పిల్లల ఇంటికే వెళ్లి 38 మంది ప్రత్యేక ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు.

– పి.శ్యాంసుందర్, జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్

పిల్లలను గుర్తిస్తున్నాం



జిల్లాలోని 19 మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులు సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకు 229 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించాం. తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ఈ విషయంలో ఐఈఆర్పీలు నిమగ్నమయ్యారు. ఇటీవల నిర్వహించిన క్యాంపుల్లో బడిఈడు పిల్లలను గుర్తించాం. వారిని చైతన్యపరిచి భవిత కేంద్రాలకు రప్పించి విద్యాబుద్ధులు నేర్పించడమే ప్రభుత్వ లక్ష్యం. మూడేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఆరేళ్ల వారిని పాఠశాలల్లో చేర్పించనున్నాం.

– సీహెచ్ సుబ్రహ్మణ్యం, సహిత విద్య సమన్వయకర్త

జాకీలతో ఇంటినే పైకెత్తి..



దుంపగడపలో జాకీలతో ఇంటిని మూడు అడుగులు ఎత్తు లేపిన దృశ్యాలు

ఆకివీడు మండలంలోని దుంపగడప గ్రామంలో 20 ఏళ్ల నాటి ఇంటిని మూడు అడుగులు పైకెత్తి నిర్మాణం చేపట్టారు. గ్రామంలో తాపీమేస్త్రిగా పనిచేస్తున్న పిల్లా శివ తన తల్లిదండ్రుల కోసం నిర్మించిన భవనం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో ఇంటి ఎత్తును పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. కొన్ని రోజులుగా పునాదుల్లోని బీములకు జాకీలు పెట్టి పైకి లేపే ప్రక్రియను పూర్తి చేశారు. ప్రస్తుతం భవనం జాకీలపై నిలిచి ఉంది. ఇప్పుడు కింద నుంచి ఇటుకలతో కట్టుబడి కడుతూ జాకీలను తొలగించుకుంటూ వస్తారని, ఇలా మూడు అడుగుల ఎత్తు పెంచుతున్నట్టు శివ చెప్పారు. నూతన సాంకేతికతతో నిపుణుల పర్యవేక్షణలో ఈ పని చేపట్టామన్నారు.

– ఆకివీడు

ఓట్ల లెక్కింపును బాధ్యతగా చేపట్టాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరంలో ఎన్నికల సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం/భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపును కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు అత్యంత బాధ్యతతో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. శనివారం భీమవరం ఆనంద ఇన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, లెక్కింపులో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

జిల్లాలో రెండు కౌంటింగ్ కేంద్రాలు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు రెండు కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటుచేయగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలు, బీవీ రాజు కళాశాలలో ఆచంట, పాలకొల్లు, నరసాపురం, తణుకు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి కౌంటింగ్ హాల్‌లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ ఏజెంట్లు ఉంటారన్నారు. లెక్కింపులో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు ఉదయం 6 గంటలలోపు కేంద్రం వద్ద రిపోర్ట్ చేయాలన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌లు ఉదయం 7 గంటలకు తెరవగానే ఈవీఎంలను పోటీలో ఉన్న అభ్యర్థుల సమక్షంలో తరలిస్తామన్నారు. 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, 8.15 గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్లకు నాలుగు టేబుళ్లు, సర్వీస్ ఓటర్ల ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపును ఒక టేబుల్ ఏర్పాటు చేస్తామన్నారు. 14 నుంచి 19 రౌండ్లలో లెక్కింపు ఉంటుందన్నారు. ప్రతి గదిలో సీసీ టీవీలు ఉంటాయని, ప్రక్రియ మొత్తం వీడియో రికార్డింగ్ చేస్తామన్నారు. కౌంటింగ్ హాల్‌లో రిటర్నింగ్ అధికారులదే సర్వాధికారమని కలెక్టర్ స్పష్టం చేశారు. జేసీ సీవీ ప్రవీణ్ ఆదిత్య, జిల్లా ఎన్నికల శిక్షణాధికారి కేసీహెచ్ అప్పారావు, ఆచంట రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు, నరసాపురం, భీమవరం ఆర్డీఓలు అంబరీష్, కె.శ్రీనివాసులురాజు, బి.వెంకటరమణ, కె.చెన్నయ్య, బి.శివనారాయణ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, ఎన్నికల సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఆచంటలో 40 మి.మీ వర్షపాతం

భీమవరం: జిల్లాలోని 20 మండలాల్లో శనివారం ఉదయానికి 187.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆచంట మండలంలో అత్యధికంగా 40 మిల్లీమీటర్లు, ఇరగవరంలో 35.6 మిల్లీమీటర్లు, పాలకొల్లులో 29.2 మిల్లీమీటర్లు, పోడూరులో 20.2 మిల్లీమీటర్ల, పెనుగొండలో 19.2, నరసాపురంలో 17.4, యలమంచిలిలో 10.2, తణుకులో 8.6, వీరవాసరంలో 4.2, మొగల్తూరులో 3.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

వైభవం.. వసంతోత్సవం

- ఘనంగా చూర్ణోత్సవం, శ్రీపుష్ప యాగోత్సవం
- ముగిసిన చినవెంకన్న బ్రహ్మోత్సవాలు
- నేటి నుంచి ఆర్జిత సేవల పునరుద్ధరణ



భక్తులపై వసంతాలు చల్లుతున్న అర్చకులు



చూర్ణోత్సవంలో వడ్లు దంచుతున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు శనివారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చనాది కార్యక్రమాలను జరిపి హారతులిచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వసంతాలను సమర్పించి, చూర్ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామివారిని కీర్తిస్తూ అర్చకులు, మహిళా భక్తులు వడ్లను దంచారు. ఆ తరువాత రాజాధిరాజ వాహనంపై శ్రీవారికి తిరువీధి సేవను నిర్వహించి భక్తులకు వసంతాలను అందజేశారు. అలాగే రాత్రి ఆలయంలో స్వామి వారికి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవాన్ని అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు.

ద్వాదశ కోవెల ప్రదక్షిణలు

ఉభయ దేవేరులతో శ్రీవారికి రాత్రి ఆలయంలో 12 ప్రదక్షిణలు, 12 సేవా కాలాలు, 12 రకాల పిండి వంటలతో నివేదనలు జరిపారు. అందులో అర్చకులు, పండితులు, భక్తులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో సేవాకాలాన్ని నిర్వహించారు. అలాగే ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో రకం పిండి వంటను ఆరగింపుచేసి స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చారు. అనంతరం శ్రీపుష్ప యాగోత్సవాన్ని ఘనంగా జరిపించారు. శ్రీహరి కళాతోరణ వేదికపై నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ వేడుకలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

నేటి నుంచి ఆర్జిత సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో రద్దు చేసిన నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను ఆదివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

శయన మహావిష్ణువుగా శ్రీవారు

శేష పాన్పుపై పవళించిన శ్రీమహా విష్ణువుకు శ్రీదేవి, భూదేవి సేవలు చేస్తున్నట్లు ఉన్న శయన మహావిష్ణువు అలంకరణలో శ్రీవారు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రోజుకో ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు.



శయనమహావిష్ణువు అలంకారంలో శ్రీవారు

క్లుప్తంగా

జూన్ 4న భీమవరంలో చెస్ పోటీలు



చెస్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో జూన్ 4 నుంచి ఆరు రోజుల పాటు ఇంటర్నేషనల్ ఫైడ్ రేటింగ్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ చెప్పారు. శనివారం పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన సందర్భంగా వివరాలను వెల్లడించారు. ఆలిండియా, ఆంధ్రా చెస్‌అసోసియేషన్, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 90632 24466 నెంబరులో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో కాస్మో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అల్లూరి పద్మరాజు, పీవీ రామరాజు, చెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, మైలాపురి మురళి పాల్గొన్నారు.

రామవరంలో 12 వాహనాల స్వాధీనం



రూరల్ పోలీసు స్టేషన్ వద్ద పట్టబడిన వాహనాలతో ఎస్సై, సిబ్బంది

కై కలూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎస్పీ డి.ప్రశాంతి ఆదేశాలతో రామవరంలో రూరల్ ఎస్ఐ టి.రామకృష్ణ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి పత్రాలు లేని 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై చెప్పారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

యలమంచిలి: గుంపర్రు గ్రామానికి చెందిన సత్తినీడి వెంకట రామకృష్ణ (67) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు. రామకృష్ణ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆ బాధ భరించలేక ఈ నెల 22న ఇంటి వద్దనే పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే పాలకొల్లు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మరణించాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆ టేస్టే వేరు!

- నూజివీడు మామిడి.. చూస్తే నోరూరాల్సిందే
- రసాలు, బంగినపల్లి, సువర్ణరేఖ, నీలాలు, జలాలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి
- నూజివీడు మామిడికి దేశ విదేశాల్లో ఖ్యాతి



నూజివీడు చిన్న రసాలు



తోతాపురి



జలాలు



పెద్ద రసాలు



చెరుకు రసాలు

నూజివీడు: పండ్లలో రారాజు మామిడి.. ఆ మామిడికి పెట్టింది పేరు నూజివీడు ప్రాంతం. ఆంధ్రప్రదేశ్‌కు ఖండాతర ఖ్యాతి తెచ్చిపెట్టిన నూజివీడు మామిడి ఏటా వేసవిలో అందరి నోరూరిస్తాయి. మామిడికి నాలుగు వేల సంవత్సరాల చరిత్ర ఉంది. వేసవి వస్తే మార్కెట్‌లో నూజివీడు చిన్నరసాలు, పెద్దరసాలు, బంగినపల్లి రకాలు ప్రతి ఒక్కరి నోరూరుస్తాయి. విజయవాడ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, విశాఖపట్నం, వరంగల్, ఖమ్మం వంటి నగరాల్లో మామిడి పళ్ల దుకాణాల్లో నూజివీడు మామిడిని ప్రత్యేకంగా అమ్ముతారు. కాయలు ఏ ప్రాంతానివైనప్పటికీ నూజివీడు మామిడి పండ్ల పేరుతో విక్రయిస్తే గిరాకీ బాగుంటుంది.

ఏటా విదేశాలకు ఎగుమతి

నూజివీడు ప్రాంతంలో చిన్నరసాలు, పెద్ద రసాలు, చెరుకు రసాలు, బంగినపల్లి, యనమదల తియ్యమామిడి, నాట్లు, జలాలు, సువర్ణరేఖ, తోతాపురి, హిమామ్ పసంద్, నీలాలు ప్రసిద్ధి. వీటిల్లో చిన్నరసాలు, పెద్ద రసాలు, చెరుకు రసాలను రసాలుగా తింటారు. బంగినపల్లి, యనమదల తియ్యమామిడిలను ముక్కలుగా కోసుకొని తింటారు. తోతాపురి రకం జ్యూస్‌కు ఎక్కువగా ఉపయోగిస్తారు. నోరూరించే మామిడి పండ్లకు కేరాఫ్ నూజివీడు మామిడి అంటే అతిశయోక్తి కాదు. వందల ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో మామిడిపై ఆధారపడి వేలాది మంది జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో



మామిడి కాయలకు సంచులు కట్టిన రైతులు

పండిన మామిడిని ప్రతి ఏటా సింగపూర్, దుబాయ్, ఇంగ్లాండ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. నూజివీడు ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి.

ఎర్రనేలలు కావడంతో మామిడికి రుచి

నూజివీడు ప్రాంతం ఇసుక, ఎర్ర రేగడి నేలలు కావడంతో ఈ నెలల్లో మామిడి తోటలను సాగు చేస్తే కాయలు రుచికరంగా ఉంటాయి. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లాలోని రెడ్డిగూడెం, విస్సన్నపేట, మైలవరం, జీ కొండూరు, ఏ కొండూరు, తిరువూరు, గంపలగూడెం మండలాల్లో సాగు చేస్తున్న మామిడి కాయలు ఎంతో రుచిగా ఉంటాయి. రైతులు ఏటా జూన్‌లో పేడ ఎరువు వేసి దుక్కిదున్నడంతో మంచి నాణ్యమైన దిగుబడులు వస్తాయి. గత కొద్ది సంవత్సరాలుగా ఆసక్తి ఉన్న రైతులు ప్రకృతి వ్యవసాయం సైతం ఆచరిస్తున్నారు. ఇక్కడ కాయలు రుచిగా ఉండటం వల్లనే నూజివీడు మామిడి అంటే ప్రతి ఒక్కరూ పరిగెత్తుతారు. నూజివీడు మామిడి పేరు చెప్పుకుని ఇతర ప్రాంతాల మామిడి కాయలను సైతం విక్రయిస్తుంటారు.

విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దేలా..



జంగారెడ్డిగూడెం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్

జంగారెడ్డిగూడెం: విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దేలా డిగ్రీ కళాశాలల్లో నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్నట్లు కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. శనివారం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తూర్పు, పశ్చిమ, కృష్ణ ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. రానున్న విద్యాసంవత్సరంలో డిగ్రీ కళాశాలల్లో అదనపు గ్రూపులు ప్రారంభించాలా? కళాశాలల పరిస్థితి ఏమిటనే విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా గతంలో మూడు సంవత్సరాల డిగ్రీలో అవలంభించిన విద్యాప్రణాళికను మార్పు చేసి, ఐదు రకాల అంశాలతో నూతన విద్యాప్రణాళిక రూపొందించామన్నారు. మేజర్ సబ్జెక్ట్, మైనర్ సబ్జెక్ట్, మల్టీ డిసిప్లినరీ కోర్సులు, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సులు, ఇంటర్న్‌షిప్ కోర్సులను అందిస్తున్నామన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఇంగ్లిష్‌లో పట్టు సాధించేలా ఇప్పటికే ఉన్న రెండు పేపర్లతో పాటు మరో రెండు పేపర్లు ప్రవేశపెడుతున్నామని, దీని ద్వారా ఇంగ్లీష్ స్కిల్స్ పెంపొంది, ఎలాంటి పోటీలోనైనా గెలిచేలా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై దృష్టి పెట్టి రూపొందించి అమలు చేస్తున్న నూతన విద్యా విధానం మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 50 వేల పైచిలుకు సీట్లు ఉండగా, 30 వేలు మాత్రమే అడ్మిషన్లు అవుతున్నాయని.. మిగిలిన 20 వేల సీట్లు సైతం పూర్తయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ఉద్యోగం, ఉపాధి సాధించేలా..

ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే విద్యార్థులను పట్టభద్రులుగా తీర్చిదిద్దడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సాధించేలా చర్యలు తీసుకున్నాని తెలిపారు. ఇందుకుగాను రూపొందించిన నూతన విద్యా ప్రణాళికను ఆకళింపు చేసుకునేలా అధ్యాపకులను బలోపేతం చేసేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించేలా మాత్రమే కాకుండా ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగేందుకు డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ కార్యక్రమాలు రూపొందించామన్నారు.డిగ్రీ కళాశాలలను 21 క్లస్టర్‌లుగా ఏర్పాటు చేసి క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. నూతన విద్యావిధానం సక్రమంగా నిర్వహించాలంటే ప్రిన్సిపాల్ ముఖ్యంగా బలంగా ఉండాలన్నారు. ఇందుకు గాను ఇప్పటికే ప్రిన్సిపాల్స్‌కు వివిధ అంశాలపై రెండు సార్లు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో కాలేజీ ఎడ్యుకేషన ఆర్‌జేడీ డాక్టర్ ఎస్.శోభారాణి, అకడమిక్ గైడెన్స్ అధికారి డాక్టర్ సీహెచ్ తులసి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు, ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

కట్టిపడేసిన సీతా పరిత్యాగం



సీతా పరిత్యాగం నాటకంలోని సన్నివేశం



ఘంటసాల నాటకంలోని సన్నివేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెంలోని బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 31వ ఉగాది నాటికల పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. శుక్రవారం రాత్రి రెండు గంటల పాటు సురభి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌరాణిక పద్య నాటకం సీతా పరిత్యాగం ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. దాదాపు 35 మంది కుటుంబ సభ్యులు ఈ పద్య నాటకంలో నటించారు. కళ్ల ముందు రామాయణ దృశ్య కావ్యం కదలాడింది. రామాయణంలోని వివిధ ఘట్టాలను సెట్టింగులు, లైటింగులతో ప్రదర్శించారు. రాముడు సూర్య నమస్కారం చేస్తున్న ఘట్టం, కుశ, లవ పాత్రలు ఆకట్టుకున్నాయి. భూదేవి భూమిని చీల్చుకుని బయటకు రావడం అనంతరం రాముడు, సీతాదేవి విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా మారడం వంటి సెట్టింగులు అలరించాయి. సురభి కళాకారులను బీవీఆర్ కళాకేంద్రం సభ్యులు ఘనంగా సత్కరించారు. బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు, పైలు శ్రీనివాస్ పర్యవేక్షించారు. పీటీ వెంకన్న, టీవీఎం కృష్ణారావు, కోటి విజయ కిషోర్, సిరిమామిళ్ల పెద్దిరాజు, కొడవటిగంటి నరసింహాచార్యులు, కర్రి ప్రభాకర్ బాలాజీ, కళాకారులు హాజరయ్యారు.

అలరించిన ఘంటసాల నాటకం

శనివారం రాత్రి సురభి నాటక బృందం ఆధ్వర్యంలో శ్రీ సాయి సంతోషి నాట్యమండలి (సురభి)చే ప్రముఖ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత చరిత్రలోని ముఖ్యమైన ఘట్టాలతో నాటకం ప్రదర్శించారు. విజయనగరంలో ఘంటసాల సంగీతం నేర్చుకోవడం, సంగీతం పూర్తిచేయడం, ఆదిభట్ల నారాయణదాసు నుంచి బహుమతి పొందడం, హిందుస్తానీ సంగీత విద్వాంసులు బడే గులాం అలీఖాన్‌కి ఆశ్రయం కల్పించడం, జాషువా వంటి ఉద్దండులతో పరిచయం, భగవద్గీత పారాయణం, పలు సంఘటనలు అలరించాయి. నాటకానికి రచన దర్శకత్వం భాస్కరుని సత్య జగదీష్ కాగా, నటీనటులు ఇంద్రకుమార్, కొండలరావు, శర్మ, వెంకట్, హారిక, రామలక్ష్మి, సుకన్య, రాయులు, సుధాకర్‌లు నటించారు.

రైతుకు లాభదాయకం కోకో

జిల్లాలో 32 వేల ఎకరాల్లో సాగు

పాడి-పంట

ఉంగుటూరు: ఉద్యాన పంటల్లో అంతరపంటగా కోకో సాగు ఆశాజనకంగా మారింది. కేజీ కోకో ధర రూ.500 పలుకుతోంది. ఈ ఏడాది కేజీ కోకో ధర వెయ్యి రూపాయలు కూడా పలికింది. ప్రస్తుతం జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాల్లో కొబ్బరి, పామాయిల్ తోటల్లో ఎక్కడ చూసినా కోకో విస్తారంగా సాగుచేస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, పెదవేగి, లింగపాలెం, చింతలపూడి, టి.నర్సాపురం, కామవరపుకోట, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, పోలవరం మండలాల్లో విస్తారంగా సాగుచేస్తున్నారు. జిల్లా మొత్తంలో 32,451 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.


కంపెనీలు కోకో మొక్కల్ని రూ.12 చొప్పున రైతులకు అందజేస్తోంది. మూడేళ్లకు దిగుబడి వస్తుంది. ఎకరాకు 200 మొక్కలు నాటాలి. నాటిన మొదటి దశలో నీడ చాటున పెరుగుతుంది. మూడేళ్ల తరువాత ఎండను తట్టుకుంటుంది. 30 సంవత్సరాల వరకు పంట ఇస్తూనే ఉంటుంది. చాక్‌లెట్ తయారీకి, బేకరీల్లో, సౌందర్య సాధనగా దీన్ని ఉపయోగిస్తుంటారు.

పంట సాగులో మెలకువలు

మొక్కనాటిన మొదటి సంవత్సరం నుంచి శిక్షణ, కత్తిరింపు అవసరం. మొక్కనాటిన 1–2 సంవత్సరాల్లో పెరుగుతున్న ప్రధాన కాండాన్ని తుంచకూడదు. మీటరు నుంచి 1.5 మీటర్లు ఎత్తు ఎదిగే సమయంలో గొడుగు మాదిరిగా 3 నుంచి 5 కొమ్మలు ఏర్పడేలా చూసుకోవాలి. గొడుగు మాదిరిగా ఏర్పడిన కొమ్మలకు రెండు అడుగులు వరకు ఎలాంటి కొమ్మలు రాకుండా కత్తిరించాలి. గొడుగు మాదిరి కొమ్మలు ఏర్పడటం వల్ల గాలి, వెలుతురు ప్రధాన కాండానికి తగిలి పూత, పిందె బాగా ఏర్పడటం, కాయ సైజు బాగా రావడం జరుగుతుంది. జూన్, జూలైలో.. మళ్లీ డిసెంబరులో తేలికపాటి కత్తిరింపులు నిర్వహించాలి. బోదు కొమ్మలు, తెగులు సోకిన కొమ్మలను నేలకు తగిలే కొమ్మలను, అడ్డదిడ్డంగా పెరిగే కొమ్మలను కత్తిరించుకోవాలి. కత్తిరించిన భాగాలకు 1 శాతం బోర్డో మిశ్రమం పూయాలి. అవసరమైతే తప్ప పురుగు మందులు విచ్చలవిడిగా పిచికారి చేయకూడదు. పురుగు మందుల వల్ల మిత్ర కీటకాలు చనిపోతాయి. ఫలితంగా పూత ఏర్పడినా కాయలు రావు.



గొల్లగూడెం ఆయకట్టు ప్రాంతంలో కొబ్బరిలో అంతరపంటగా కోకో



కోకో కాయలు

ఎరువుల యాజమాన్యం

ప్రతి మొక్కకి ఎరువులు యాజమాన్యం పాటించాలి. 100 గ్రాముల నత్రజని, 40 గ్రాముల భాస్వరం, 140 గ్రాములు పొటాష్‌ను ప్రతీ మొక్కకి అందించాలి. దీంతో పాటుగా 5 కిలోలు చివికిన పశువుల ఎరువు, 1 కేజీ వేపపిండి అందించాలి.

సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



కోకోలో యాజమాన్య పద్ధతులు సరిగా అమలు చేస్తే దిగుబడి బాగుంటుంది. మెట్టలో కొబ్బరి పంట, ఆయిల్‌పాం మధ్యలో కోకో పంట దిగుబడి బాగుంది.

– మద్దిపాటి దిలీప్, ఉద్యాన సహాయకుడు, గొల్లగూడెం,

ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి



మా కొబ్బరితోటలో వేసిన కోకోకు 20 సంవత్సరాలు వయసుంది. ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఈ పంట మెట్ట ప్రాంత రైతులకు అనుకూలంగా ఉంటుంది.

– ఈదల గంగాధరరావు, రైతు, గొల్లగూడెం

నీటి యాజమాన్యం

నీరు ఎక్కువయితే ఆకులు ఎక్కువగా పెరిగి పూత తగ్గుతుంది. తగిన మోతాదులో నీరు అందించాలి. జింకు, ఐరన్ లోపాలు రాకుండా చూసుకోవాలి. ఎలుకలు, ఉడతల బెడద ఉంటే బ్రోమోడియోలిన్ కేకులను కొమ్మలపై ఉంచాలి.

లారీని ఢీకొన్న ఆటో.. మహిళ మృతి



ఆటో ఢీకొనడంతో సంఘటనా స్థలంలో మృతి చెందిన మహిళ

మొగల్తూరు: పుణ్య క్షేత్రానికి వెళ్తూ జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం జరిగింది. మొగల్తూరు ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా గుడ్లవల్లూరు మండలం శేరేదగ్గుమిల్లి గ్రామానికి చెందిన తొమ్మిది మంది భక్తులు పాసింజర్ ఆటోలో తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వెంకటేశ్వర స్వామి దర్శనానికి బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో మొగల్తూరు మండలం కాళీపట్నం తూర్పు గ్రామంలోని జాతీయ రహదారిపై ఆగిఉన్న సిమెంట్ లోడ్ లారీని శనివారం ఉదయం 5 గంటల సమయంలో బలంగా ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బొర్ర విష్ణువర్ధిని(53) సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, మిగిలిన ప్రయాణికులకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనాథ చిన్నారుల నిర్బంధం

పోలీసుల చొరవతో విడిపించిన వైనం



మండలంలోని దుంపగడపలో వెల్డింగ్ షాపులో బాలలతో మాట్లాడుతున్న ఎస్ఐ బీ నాగబాబు

ఆకివీడు: చెత్త కాగితాలు ఏరుకునే అనాథ పిల్లల్ని వెల్డింగ్ షాపులో 9 గంటలపాటు నిర్బంధించిన సంఘటన మండలంలోని దుంపగడప గ్రామంలోని లారీ సప్లయ్ ఆఫీస్ సమీపంలో శనివారం జరిగింది. ఉప్పుటేరు వంతెన పడమరవైపున చెత్త కాగితాలు ఏరుకుంటున్న నలుగురు పిల్లల్ని పట్టుకుని, సామాన్లు దొంగిలించుకుపోతున్నారంటూ కట్టేసి.. ఉప్పుటేరు తూర్పువైపున దుంపగడప గ్రామంలోని లారీ సప్లయ్ ఆఫీసు సమీపంలోని వెల్డింగ్ షాపులో నిర్బంధించారు. అనాథలైన ఆ చిన్నారులను చేరదీసి పెంచుకుంటున్న కొంతమంది మహిళలు విషయం తెలుసుని సంఘటనా స్థలానికి వచ్చి తమ బిడ్డల్ని విడిచిపెట్టాలని కోరారు. తమ పిల్లల్ని, తమని పైపులతో కొట్టి గాయపరిచారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై బత్తిన నాగబాబు సంఘటనా స్థలానికి వచ్చి నిర్బంధంలో ఉన్న చిన్నారుల్ని విడిపించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. షాపులో నిర్బంధించిన సంఘటనపైన, దాడి చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్ విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. అడ్మిషన్లు అరికట్టాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రూప శంకర్, సహాయ కార్యదర్శి శ్రీనులు మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖాధికారులు ప్రకటనలు చేసిన ఏ మాత్రం కార్పొరేట్ శక్తులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, అడ్మిషన్లు తీసుకుంటే ఫీజు రాయితీ 20 శాతం తగ్గిస్తామంటూ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. మానసిక ఉల్లాసం లేకుండా తరగతులు నిర్వహిస్తున్నారని, తక్షణమే డీఈఓ, ఆర్డీఓలు స్పందించాలని కోరారు. ఆయా సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం



పుస్తక సమీక్ష రాస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణా శిబిరం నిర్వహించారు. హాజరైన విద్యార్థులకు సైన్సు పాఠ్యాంశాలు, వినే నైపుణ్యాలు (కథలు), పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీషు, గ్రామర్, క్రాఫ్ట్, డాన్స్, పెయింటింగ్, ఆటలు, ఆధ్యాత్మిక విషయాలు, యోగా తరగతులు, వివిధ సబ్జెక్ట్స్, నీతి కథలను చెప్పారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రత్తి వీరాస్వామి, గరికిపాటి బాపయ్యశర్మ, యోగా మాస్టార్ పి.పాండు, ఉపాధ్యాయులు ఎన్.సత్యం, వి.రామాంజనేయులు, ఏవీ లక్ష్మణరావు పిల్లలకు అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు హాజరై ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



అత్తిలిశాఖా గ్రంథాలయంలో చిరుధాన్యాల ఆవశ్యకతను వివరిస్తున్న రిటైర్డు తహసీల్దార్

అత్తిలి: స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణలో భాగంగా శనివారం విద్యార్థులకు చిరుధాన్యాలు, మిల్లెట్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెరుగైన ఆరోగ్యం కోసం చిరుధాన్యాలు ఎంతో ఉపయోడపడతాయని రిటైర్డు తహసీల్దార్ ఆర్‌వీ సత్యనారాయణ అన్నారు. రిసోర్సుపర్సన్ కె కోమలి మాట్లాడుతూ రక్తహీనత నివారణకు చిరుధాన్యాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి వెంకటేశ్వరరావు, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, దాన కృష్ణ, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.

పదో తరగతి సప్లిమెంటరీ హిందీ పరీక్ష ప్రశాంతం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి శనివారం హిందీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని ఏడు స్కూల్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల, కడకట్ల మునిసిపల్ హైస్కూల్, సుబ్బారావుపేట మునిసిపల్ హైస్కూల్, కింబర్లీ, మాంటిస్సోరి, సెంట్ జోన్స్, భాష్యం స్కూల్లో పరీక్షలు నిర్వహించారు. 250 మంది విద్యార్థులకు 22 మంది పరీక్షలకు హాజరయ్యారు. 228 మంది గైర్హాజరయ్యారు.

పిల్లల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

నరసాపురం: పిల్లల పెంపకంలో తల్లితండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. శనివారం అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా కోర్టు వద్ద డ్వాక్రా మహిళలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ నరసాపురం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్జి గంగరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పిల్లలను సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని సూచించారు. ఎవరైనా పిల్లల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు, అధికారులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా దానయ్యనాయుడు, కార్యదర్శి ఆర్‌జీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం.. రాగి తీగ చోరీ

- ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో రైతులకు విద్యుత్ ఇబ్బందులు
- విద్యుత్ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు



బంగారుగూడెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, రాగి తీగ చోరీ చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో ఇటీవల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీ ఘటనలు పెరిగాయి. జిల్లాలో 92 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీ చేయగా, ఒక్క తాడేపల్లిగూడెం మండలంలోనే 45 ఘటనలు జరిగాయని అధికారులు చెబుతున్నారు. నీలాద్రిపురం గ్రామంలో 19 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, రాగి తీగను చోరీ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై సంబంధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ చోరీలపై విద్యుత్ శాఖ అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. వారి విజ్ఞప్తి మేరకు అంచనాలను రూపొందించి ఉన్నతాధికారులకు పంపించినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో సాగు అవసరాలకు నీరు పెట్టే పరిస్థితి కానరావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. త్వరితగతిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అర్హతలున్నా అందని హక్కులు



డీఎస్సీ 98 క్వాలిఫైడ్ టీచర్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డీఎస్సీ 98 క్వాలిఫైడ్ టీచర్లు పరీక్షల్లో అర్హత మార్కులు సాధించి, ఇంటర్వ్యూలో ప్రతిభచూపి అన్ని అర్హతలు సాధించిన ప్పటికీ క్వాలిఫైడ్ టీచర్లకు రావాల్సిన హక్కులు పెన్షన్ సౌకర్యం, ఉద్యోగ క్రమబద్ధీకరణ, హెల్త్ సర్వీస్‌లు అందడం లేదని 1998 డీఎస్సీ 1998 ఎంటీఎస్ టీచర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తాడేపల్లిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం ఎంటీఎస్ టీచర్లు యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పి.బెనర్జీ మాట్లాడుతూ 25 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ ఫలించి ఉద్యోగాలు రావడం, ఒక సంవత్సరం సర్వీస్‌ను పూర్తి చేసినందుకు సంతోషదాయకం అన్నారు. జిల్లాలో సంవత్సర కాలంలో 23 మంది ఎంటీఎస్ టీచర్లు ఉద్యోగ విరమణ పొందినట్టు చెప్పారు. ఉద్యోగం వచ్చిన ఆనందం అనతి కాలంలోనే ఆవిరైందని వాపోయారు. సాధారణ ఉపాధ్యాయులు వయస్సు 62 ఏళ్లు కాగా ఎంటీఎస్ ఉద్యోగులకు 60 ఏళ్ల నిబంధన ఉందని తెలిపారు. వయో పరిమితి 62 ఉంచాలని, విశ్రాంత పొందిన, విశ్రాంత (రిటైర్) అవ్వబోతున్న ఎంటీఎస్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరారు. తమ నియామకంలో నివాసాలకు దూరంగా, మారుమూల ప్రాంతాలకు వెళ్లడం వల్ల చాలీచాలని జీతంతో, అనారోగ్యాలు పాలవుతున్నామని, ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. సమావేశంలో కె.మోహన్‌రావు, ఆచారి, ఎం.ఎస్.రాజు, నాగేంద్ర, జి.శాంత హెలిన్, జి.మంజుల పాల్గొన్నారు.

కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాలి



ఆర్టీసీ డిపో వద్ద కపర్ది వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న కార్మిక నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సుప్రసిద్ధ కార్మిక నేత, ఆదర్శ కమ్యూనిస్టు అమరజీవి ఎంవీఎస్ కపర్ది పోరాటాల స్ఫూర్తితో కార్మికోద్యమాన్ని బలోపేతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. కపర్ది 43వ వర్ధంతి సందర్భంగా ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం ఆవరణలోని కపర్దీ విగ్రహానికి కార్మిక సంఘాల నాయకులు శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ, అనుబంధ కార్మిక సంఘాలు నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో తోట సత్యనారాయణ, దువ్వా శ్రీనివాస్, సీహెచ్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

ఎంవీఎస్ కపర్ది 43వ వర్ధంతిని శనివారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక కపర్ది భవనంలో ఘనంగా నిర్వహించారు. కపర్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు సీపీఐ నాయకులు అల్లం రాము, మేరీ, బాలు, కుమారి పాల్గొన్నారు.

కపర్దీ జీవితం ఆదర్శనీయం

కమ్యూనిస్టు నేత కపర్దీ జీవితం ఆదర్శనీయమని ఏపీ తెలంగాణ బ్యాంకు ఉద్యోగుల ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి టీవీ సూర్యనారాయణ పేర్కొన్నారు. కమ్యూనిస్టు నేత కపర్దీ వర్ధంతిని బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద బ్యాంకు యూనియన్ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీహెచ్ సీనియర్ నాయకులు వి.సురేష్‌కుమార్, ఎస్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మెరుగైన వైద్యం

ఆకివీడు: నిరంతర పర్యవేక్షణతోనే వృద్ధులకు మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మహేశ్వరరావు చెప్పారు. స్థానిక సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో గొట్టుముక్కల శ్రీరామరాజు జ్ఞాపకార్థం శనివారం చీరలు, భోజన ప్యాకెట్లను లయన్స్ కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహేశ్వరరావు మాట్లాడుతూ వృద్ధులకు బీపీ, సుగర్, ఇతర ఆరోగ్య సమస్యల్ని ఎప్పటికప్పుడు ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 12 ఏళ్లుగా ఈ ప్రాంతంలో సేవలందించడం హర్షదాయకమన్నారు. సంఘ గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎంపీ.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ పుష్కర కాలంగా వృద్ధులకు వివిధ రూపాల్లో సేవలందిస్తున్నట్లు చెప్పారు. సంఘ అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య మాట్లాడతూ వృద్ధులకు చట్టంపై అవగాహన కల్పిస్తూ 100కు పైగా సదస్సులు నిర్వహించామన్నారు. సంఘ సభ్యులు పల్లి అప్పిరెడ్డి, నేరెళ్ల ఆదినారాయణ, వీజే.కోటేశ్వరరావుబాబు, అడవి సుబ్బారావు, లయన్స్ అధ్యక్షుడు వీవీ.కృష్ణంరాజు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యానికి కిల్కారీ సేవలు



మాధవరం పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ వీరవెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కిల్కారీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, వీటి సేవలను గర్భవతులు వినియోగించుకోవాలని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వీరవెంకటేష్ సూచించారు. శనివారం మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కిల్కారీ మొబైల్ యాప్‌పై ఆరోగ్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరవెంకటేష్ మాట్లాడుతూ గర్భిణులకు నాల్గవ నెల నుంచి తొమ్మిదో నెల వరకు, బిడ్డ పుట్టిన ఏడాది లోపు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార నియమాలను యాప్ ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేస్తారన్నారు. మరో డాక్టర్ సింధు మాట్లాడుతూ ఆశ కార్యకర్తలంతా కిల్కారీ యాప్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని సర్టిఫికెట్లు పొందాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సిర్రా అశోక్‌బాబు, హెల్త్ విజిటర్ సీహెచ్.మణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కూలీ కుటుంబాలకు రూ.5 లక్షలు బీమా చెల్లించాలి



తాడేపల్లిగూడెం మండలంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న కళింగ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకం పని ప్రాంతంలో మృతి చెందిన వ్యవసాయ కూలీల కుటుంబాలకు రూ.5 లక్షలు బీమా చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చినతాడేపల్లి, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, కృష్ణాపురంలోని ఉపాధి పని ప్రాంతాలను సందర్శించి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు రోజుకు రూ.600 కూలి చెల్లించాలని, రెండు పూటలా పని విధానం అమలు చేయాలన్నారు. పని ప్రాంతంలో ప్రమాదవశాత్తు అంగవైకల్యానికి గురైతే రూ.2లక్షలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉల్లింకల జయకృష్ణ, యు.నాగలక్ష్మి, దూలపల్లి వెంకట్రాజు, జాలపర్తి వెంకట్రావు, డి.ఏడుకొండలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలి



తణుకు న్యాయ విజ్ఞాన సదస్సులో ప్యానెల్ న్యాయవాదులు

తణుకు అర్బన్: ఇంటర్నేషనల్ మిస్సింగ్ చిల్డ్రన్స్ డే సందర్భంగా తణుకు కోర్టు మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు శివారులోని నివాసితులకు తణుకు ప్యానెల్ న్యాయవాదులు శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాదులు ఎ.అజయ్‌కుమార్, టి.సత్యనారాయణరాజు, ముప్పిడి సుబ్బయ్య, కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లితండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలని సూచించారు. తల్లిదండ్రుల్లో ఐక్యత లేకపోవడం, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, పిల్లల్లో చెడు వ్యసనాలు తదితర కారణాలతో పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయే పరిస్థితులు ఏర్పడతాయని స్పష్టం చేశారు. తమ పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రులపై ఉందని అన్నారు. ఈ తరహాలో ఇంటి నుంచి బయటకు వచ్చిన పిల్లలను కొన్ని ముఠాలు కళ్లు లేనివారిగా, కుంటివారిగా చిత్రీకరించి భిక్షాటన చేయిస్తున్నారని చెప్పారు. ఇలా ఎవరైనా పిల్లలు భిక్షాటన చేస్తూ తారసపడితే వెంటనే స్థానికులు 1098 నంబరులో ఛైల్డ్‌లైన్‌కు, 100 నంబరుతో పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పిల్లలను కార్మికులుగా మార్చి పనులు చేయించుకుంటున్నారని ఇది నేరమని, సంబంధిత వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

వైభవంగా గోగులమ్మ సేవా మహోత్సవం



రాచర్లలో పూజలందుకుంటున్న గ్రామ దేవత గోగులమ్మ

పెంటపాడు: గ్రామంలో 22 ఏళ్లకు ఒకసారి నిర్వహించే రాచర్ల గోగులమ్మవారి ఉత్సవాలు ఈనెల 18 నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం రాత్రి అమ్మవారి పెద్ద సేవ కార్యక్రమంలో భాగంగా సేవా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. నైవేద్యాలు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామం అంతా ఆడపడుచులతో కళకళలాడింది. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. రాత్రి అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆసాదుల నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, బుట్టబొమ్మల విన్యాసాలు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల మధ్య అమ్మవారికి సేవ నిర్వహించారు. 26న భారీ జాతర, నైవేద్యాలు ఉంటాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అమ్మవారిని సర్పంచ్ వాకా దుర్గాభవాని, వెంకట సుబ్బారావు దంపతులు, ఎంపీటీసీ చింతన శారద, నారాయణరావు దంపతులు, మాజీ సర్పంచ్ డోకల కమలాకర్ దంపతులు ప్రత్యేక పూజలు చేసారు.

విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన



వేల్పూరు గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ కార్యక్రమాలు

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నిర్వహించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు



పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: ఖరీఫ్ సాగుకు సంబంధించి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం సాయంత్రం తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకుల వారి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధి తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం మండలాల్లో 25,431 హెక్టార్లలో వరి సాగు జరుగుతోందన్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి 2,541 క్వింటాళ్ల విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేసేందుకు సిద్ధం చేశామన్నారు. ప్రధానంగా ఎంటీయూ 7029, 1318, సంపద స్వర్ణ, 1061, 1064 రకాల వరి వంగడాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావలసిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకుంటే రెండు, మూడు రోజుల్లో విత్తనాలు అందిస్తామన్నారు. జీలుగ, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు 200 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువుల ఖర్చులు తగ్గించుకునేందుకు పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవాలని సూచించారు. 45 రోజుల వయసున్న పచ్చిరొట్టను భూమిలో దుక్కి దున్నడం వల్ల భూమికి కావలసిన పోషకాలు మెండుగా లభిస్తాయన్నారు. తద్వారా ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని తగ్గించవచ్చన్నారు.

నూతన పాఠ్య పుస్తకాలు సిద్ధం



మొగల్తూరులోని స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను దిగుమతి చేస్తున్న ఎంఈఓ కార్యాలయ సిబ్బంది

మొగల్తూరు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు సిద్ధమవుతున్నాయి. పాఠశాలల తెరిచిన రోజే విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో సంబంధిత విద్యాశాఖాధికారులు ఇండెంట్‌లు అందించారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కానుండటంతో 8వ తేదీ నాటికే పాఠ్యపుస్తకాలు సిద్ధం చేస్తున్నారు. దీనిలో భాగంగానే మండలంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 46,150 పాఠ్యపుస్తకాలకు ఇండెంట్ పెట్టగా మొదటి విడతలో 17072 పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ శామ్యూల్ జాన్ శనివారం తెలిపారు. వచ్చిన పుస్తకాలను మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌లో ఉంచామన్నారు. మిగిలిన పుస్తకాలు కూడా త్వరలో రానున్నాయని, పాఠశాలలు పునః ప్రారంభం కావడానికి ముందుగానే ఆయా పాఠశాలలోని విద్యార్థులకు అందజేస్తామని స్పష్టం చేశారు.

అల్లర్ల నివారణలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలం



చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలోని రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో అల్లర్లు, గొడవలకు తెరలేపి, ఆ ప్రాంతాలను మరో రావణ కాష్టంలా మార్చేందుకు టీడీపీ కుట్రలు పన్నిందని, అల్లర్లను నివారించడంలో ఎన్నికల కమిషన్, పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంత మంది అధికారులు టీడీపీకి సహకరిస్తూ ప్రజల్లో లేనిపోని అపోహలు, ఆందోళనలు కలిగేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీకి ఎక్కడా ఓటు బ్యాంకు చెక్కు చెదరలేదని, అన్ని వర్గాలు జగన్‌కు బాసటగా నిలిచాయని చెప్పారు. రాష్ట్రంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్‌కు, డీజీపీకు మాల మహానాడు తరుపున విజ్ఞప్తి చేశారు. నాయకులు టి.శివ, సునీల్‌బాబు, కిరణ్, గోపి పాల్గొన్నారు.

వేతన బకాయిల చెల్లింపుపై హర్షం

తణుకు: మున్సిపల్ స్కూల్ స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించడంపై సీఐటీయూ తణుకు మండల కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం మండల అధ్యక్షుడు ఎన్.ఆదినారాయణబాబు, కార్యదర్శి గుబ్బల గోపి, జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ మున్సిపల్ స్కూల్స్ ప్రభుత్వంలోకి మార్పు చేయడం వల్ల 14 నెలలుగా స్వీపర్లకు వేతనాలు లేవన్నారు. ఎన్నో పర్యాయాలు చేసిన ఆందోళన ఫలితంగా పది నెలల బకాయిలను అధికారులు విడుదల చేశారని చెప్పారు. ఇకపై ప్రతి నెలా స్వీపర్లకు వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని కోరారు.

89 మందికి కంటి పరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ సేవా ట్రస్టు ఆసుపత్రిలో శనివారం కంటి వైద్య పరీక్షల్లో భాగంగా 89 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసారు. 15 మందికి కళ్లజోళ్లు రాయితీపై అందించారు. మరో 20 మందిని శస్త్రచికిత్సల కోసం తరలించారు. 70 మందికి జనరల్ వైద్య పరీక్షలు చేసారు. 39 మందికి ఫిజియోథెరఫీ సేవలందించారు. 20 మందికి దంత పరీక్షలు చేసారు. ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు

అత్తిలి: ఈడూరులో వేంచేసియున్న వరాల వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాల సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారిని విశేషంగా అలంకరించి అర్చనలు చేశారు. అలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేసారు.

వాతావరణ మార్పులతో రైతుల్లో ఆందోళన



కేపీ పాలెంలో వీస్తున్న ఈదురుగాలులకు ఊగుతున్న చెట్లు

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో శుక్రవారం సాయంత్రం నుంచి ఈదురుగాలులు, కొద్దిపాటి వర్షం పడుతుంది. శనివారం ఉదయం నుండి ఆకాశం మేఘావృత్తమై ఉండటంతో పాటు చిరుగాలులు వీస్తున్నాయి. వాయుగుండం తుఫాన్‌గా మారడంతో రానున్న రెండు రోజులు పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆలస్యంగా ఊడ్చిన చేలల్లో వరి కోతలు కోయక పోవడంతో పాటుకోసిన ధాన్యం గత రెండు రోజులుగా కురిసిన కొద్దిపాటి వర్షానికి తడిసిపోయాయి. మరో వారం రోజులు పాటు వర్షాలు కురుకవకుండా వరుణుడు కాపాడితే పంట నష్టం నుండి గట్టెక్కుతామని రైతులు పేర్కొంటున్నారు.

మత్స్యకారులు సముద్రపు వేటకు వెళ్లవద్దు

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా రానున్న రెండు రోజులు పాటు మత్స్యకారులు సముద్రవేటకు వెళ్లవద్దని తహసీల్దార్ భాస్కర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీచ్‌కు వచ్చే సందర్శకులు సముద్ర స్నానం చేయడానికి లోపలకు వెళ్లరాదని, తగిన జాగ్రత్తలు తీసుకుని సముద్ర స్నానం చేయాలని సూచించారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 48 మంది ఎంపిక

తణుకు టౌన్: తణుకులోని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ప్లేస్‌మెంట్ విభాగం చెన్నైకి చెందిన భన్యన్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో టాటా క్వెష్ (కనెక్ట్ బిజినెస్ సొల్యూషన్స్) నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో తమ కళాశాలకు చెందిన 48 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె రామకృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలో నిర్వహించిన ఈ క్యాంపస్ సెలెక్షన్స్‌లో జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తారని, వీరికి సంవత్సరానికి రూ.2.40 లక్షలు వార్షిక వేతనం అందజేస్తారని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీసుందరిబాయి అభినందించారు.